క్లుప్తంగా

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా మారెన్న



ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మారెన్న

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంప్రాజెక్ట్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శనివారం ఆర్ మారెన్న బాధ్యతలు చేపట్టారు. కర్నూలు బి.క్యాంప్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్న మారెన్నకు ప్రిన్సిపాల్‌గా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా పని చేసిన కొండారెడ్డి మారెన్నకు బాధ్యతలు అప్పగించారు. సిబ్బంది నూతన ప్రిన్సిపాల్‌ను అభినందించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



బేటీ బచావో.. బేటీ పఢావో కార్యక్రమం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

మిడుతూరు: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుకాదేవి అన్నారు. శనివారం మండల పరిధిలోని చెరుకుచెర్ల, బైరాపురం, తిమ్మాపురం, జలకనూరు గ్రామాల్లో బేటీ బచావో.. బేటీ పఢావో కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పౌష్టికాహారం తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలు, తీసుకోని పక్షంలో కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వర్ణలత, శ్రీనివాసులు, అంగన్ వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో గిరిజన జీవితాల్లో మార్పు



మాట్లాడుతున్న రాజు నాయక్

వెలుగోడు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక గిరిజనుల బతుకుల్లో మార్పు వచ్చిందని, తలెత్తుకొని జీవిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ అన్నారు. శనివారం స్థానిక జమ్మి నగర్‌తండాలో రాజు నాయక్ పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. ఇటీవల మచిలీపట్నంలో నిర్వహించిన సభలో టీడీపీ, జనసేన నేతలు పోలీసులపై రెచ్చిపోయి బరితెగించే వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. అధికారంలోకి వస్తే మీ అంతు తేలుస్తామని బెదిరింపులు గురి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కనుచూపుమేరలో వారి పార్టీ అధికారంలోకి వస్తుందనే ఆశలేకనే టీడీపీ, జనసేన నేతలు ఇలాంటి బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. సభలో ఇలాంటి వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. శ్రీశైలం నియోజకవర్గంలో ఎక్కువ శాతం గిరిజనులు ఉన్నారని వారంతా జగన్‌తోనే ఉన్నారని తెలిపారు. మరోసారి శిల్పా చక్రపాణి రెడ్డి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



శివపురంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ నాగభూషణ్

కొత్తపల్లి: గ్రామాలలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు రూరల్ సీఐ నాగభూషన్ హెచ్చరించారు. శనివారం కొత్తపల్లి ఎస్ఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలో శివపురం, ఎం.లింగాపురం, కొత్తపల్లి గ్రామాలలో పోలీసు కవాతు నిర్వహించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

మహానంది: ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎవరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, సోషల్ మీడియాల్లో అసభ్యకరమైన పోస్టులు పెట్టడం లాంటివి చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని రూరల్ సీఐ శివకుమార్‌రెడ్డి, మహానంది, బండి ఆత్మకూరు ఎస్ఐలు నాగేంద్రప్రసాద్, మల్లికార్జున హెచ్చరించారు. శనివారం వారు మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ నేపథ్యంలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రజలను మభ్యపెట్టడం, ప్రలోభాలకు గురిచేయడం సరికాదన్నారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో పోలీసులు నిఘా ఉంచారని చెప్పారు.

దాడి కేసులో ఇద్దరి అరెస్ట్

మహానంది: గోపవరం గ్రామానికి చెందిన సంతోష్‌పై దాడి చేసిన కేసులో అదే గ్రామానికి చెందిన నారాయణ, జయమ్మలను శనివారం అరెస్ట్ చేసినట్లు మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. కొద్ది రోజుల క్రితం సంతోష్‌పై దాడి చేసిన ఘటనలో వారిపై కేసు నమోదు కావడంతో అరెస్ట్ చేసినట్లు చెప్పారు. అలాగే బసవాపురం గ్రామానికి చెందిన నలుగురిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

రైతు శ్రేయస్సే జగనన్న ధ్యేయం

- ఏపీ శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
- సంక్షేమం, అభివృద్ధికే మళ్లీ పట్టం కట్టండి
- నియోజకవర్గ ఇన్‌చార్జ్ దారా సుధీర్‌తో కలసి గోడౌన్ల ప్రారంభం





చెరుకుచెర్లలో గోదామును ప్రారంభిస్తున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, డాక్టర్ దారా సుధీర్, కొత్తపల్లిలో రిబ్బన్ కట్‌చేసి మల్టీపర్పస్ గోదాములను ప్రారంభిస్తున్న దృశ్యం

మిడుతూరు/కొత్తపల్లి: రైతు శ్రేయస్సే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దారా సుధీర్ అన్నారు. శనివారం మిడుతూరు మండల పరిధిలోని చెరుకుచెర్ల గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన రైతు బహుళ ప్రయోజన సౌకర్య గోదామును ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామానికి చేరుకున్న సిద్ధార్థరెడ్డి, దారా సుధీర్‌లకు సర్పంచ్ మరియమ్మ, మాజీ సర్పంచ్ పేరెడ్డి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. అలాగే కొత్తపల్లి మండల కేంద్రంలో రూ.1.10 కోట్ల వ్యయంతో నిర్మించిన మల్టీపర్పస్ గోదాములను నాగంపల్లి సొసైటీ చైర్మన్ గౌరు జనార్దన్‌రెడ్డి, సీఈఓ కోటీల ఆధ్వర్యంలో ప్రారంభించారు.

రైతుల కోసం సబ్సిడీ పథకాలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నుంచి నేటివరకు రైతులకోసం రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం, ఆర్బీకేల ద్వారా రసాయన ఎరువులు, పురుగు మందులు, ఇతర వ్యవసాయ పనిముట్లు, హార్వేస్టర్లు వంటివి సబ్సిడీపై ఇస్తున్నారని సిద్ధార్థరెడ్డి అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్రతి గ్రామంలో మల్టీపర్పస్ గోదాములను నిర్మించి వాటిలో రైతులు ధాన్యాన్ని భద్రపరచుకునేందుకు వీలు కల్పిస్తున్నారని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు మూకుమ్మడిగా దొంగ హామీలతో ప్రజల ముందుకు వస్తున్నారని, వారిని నమ్మి మోసపోవద్దన్నారు. ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు.

సంక్షేమం, అభివృద్ధికే మళ్లీ పట్టం కట్టండి

కులాలు, మతాలు, పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే మళ్లీ పట్టం కట్టాలని నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ అన్నారు. రెండు సంవత్సరాల పాటు కరోనా మహమ్మారి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపిందన్నారు. అయినా ఎక్కడా రాజీ పడకుండా సంక్షేమ పథకాలు కొనసాగించారని కొనియాడారు. కార్యక్రమాల్లో మిడుతూరు ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ, నబిరసూల్, పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ మౌలా, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తువ్వా లోకేశ్వరరెడ్డి, కొత్తపల్లి జెడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డి, మండల కన్వీనర్ కె.సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సింగారం వెంకటరమణ(రంగ), వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగ ఎల్లయ్య, కో-ఆప్టెడ్ మెంబర్ మహమ్మద్ గౌస్, నాగంపల్లి సొసైటీ మెంబర్ అచ్చిరెడ్డి, కొలను భారతి చైర్మన్ వెంకటనాయుడు, సర్పంచులు మశమ్మ, బాల ఎల్లయ్య, మారెన్న, ఎంపీటీసీలు స్రవంతి, బాలరాజు, శివన్న తదితరులు పాల్గొన్నారు.

రైతుల పాలిట పెన్నిధి వైఎస్ జగన్

పాములపాడు: రైతుల పాలిట పెన్నిధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దారా సుధీర్ అన్నారు. శనివారం మండలంలోని ఇస్కాల గ్రామంలో రూ.75లక్షల అంచనా తో నిర్మించిన బహుళ ప్రయోజన సౌకర్య గోదామును ప్రారంభించారు. అలాగే మిట్టకందాల గ్రామంలో గోదామును ప్రారంభించారు.



నందీశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, దారా సుధీర్

నందీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

ఇస్కాల గ్రామ సమీపంలో భవనాశి నది ఒడ్డున వెలిసిన శ్రీశైలం ప్రథమ ముఖ ద్వారమైన నందీశ్వరాలయంలో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, దారా సుధీర్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో సీఈఓ సునీల్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి, సర్పంచులు మౌలాలి, నారాయణ, రామ స్వామి, కోట్ల చంద్రారెడ్డి, వరప్రసాద్, సొసైటీ చైర్మన్లు వెంకటస్వామి, గడ్డం కృష్ణారెడ్డి, చౌడయ్య, జేసీఎస్ కన్వీనర్ నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న జడ్జి ఇందిరా ప్రియదర్శిని

నందికొట్కూరు: జాతీయ లోక్ అదాలత్‌లో కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని అన్నారు. శనివారం పట్టణంలోని కోర్టు ఛాంబర్‌లో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ రాజీమార్గంలో 44 కేసులను పరిష్కరించడం జరిగిందన్నారు. ఆయా కేసులకు సంబంధించి రూ.8, 48, 510 జరిమానా కింద రాబట్టినట్లు తెలిపారు.

ఆత్మకూరు కోర్టులో..

ఆత్మకూరు: పట్టణంలోని కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ కార్యక్రమంలో పలు కేసులు పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జ్ జూనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ తెలిపారు. లోక్‌అదాలత్‌లో 20 క్రిమినల్ కేసులు, 10 సివిల్ కేసులు, ఒక మెయింటెన్స్ కేసు పరిష్కరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు మాణిక్యరావు, బలరాం నాయక్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు కోర్టులో కేసులు పరిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద మాట్లాడుతున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, డాక్టర్ దారా సుధీర్



పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లులర్పిస్తున్న శిల్పా కార్తీక్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్లు

నందికొట్కూరు: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని శాప్ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. శనివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి డాక్టర్ దారా సుధీర్, ఆర్య వైశ్య సంఘం నాయకులతో కలసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి పాలాభిషేకం చేశారు. సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ తెలుగు రాష్ట్ర సాధనకు ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కమిషనర్ సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు లాలు, సురేష్, రవూఫ్, వైఎస్సార్‌సీపీ నాయకులు సులోచనమ్మ, జబ్బార్, రామకృష్ణ, కుర్వ శ్రీను, బ్రహ్మయ్య, రమేష్, శ్రీకాంత్, ఆర్యవైశ్య, అనుబంధ సంఘాల నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అమరజీవి పొట్టిశ్రీరాములు

ఆత్మకూరు: తెలుగు రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువ లేనివని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు శిల్పా కార్తీక్ రెడ్డి అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్, వార్డు కౌన్సిలర్లు విజయ్ చౌదరి, విజయ్‌కుమార్, పువ్వాడ భాస్కర్, కలిముల్లా, నాయకులు సయ్యద్‌మీర్, అబ్దుల్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

శ్రీశైలంప్రాజెక్ట్: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని వాసవీ మహిళామండలి సభ్యులు, ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో సున్నిపెంటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. సోమిశెట్టి మల్లికార్జున, ఇవి.సత్యనారాయణ, గెల్లి వెంకటేశ్వర్లు, చల్లా కిశోర్, కల్వ వెంకటేశ్వర్లు తదితరులు ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. ఐటీడీఏ కార్యాలయంలో అధికారులు పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధికారులు ధనుంజయ, బి.వి.శేషగిరి రావు, కె.జి.నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.



పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వాసవీ మహిళా మండలి సభ్యులు



వెలుగోడులో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

వెలుగోడు: పట్టణ ప్రధాన కూడలిలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లాల వాణిజ్య విభాగం అధ్యక్షుడు బళ్లాని వెంకట సత్యనారాయణ, మండల అధ్యక్షుడు బచ్చు రాము, సోమ శేఖర్, నాగరాజు, గోపాలకష్ణ, తాళ్లూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

శ్రీశైలంటెంపుల్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలల్లో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి చేకూరిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎంఏ.రజాక్ తెలిపారు. శనివారం శ్రీశైలంలోని 4వ బూత్‌లోని కరికాల సత్రం, స్టాఫ్‌క్వాటర్స్, రెడ్డి సత్రం, ఓల్డ్ ఏజ్‌హోమ్ తదితర ఏరియాలలో ఇంటింటికి వెళ్లి ఇప్పటి వరకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. రజాక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి అవసరాలను తెలుసుకుని తదనుగుణంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని అన్నారు. మరోసారి శ్రీశైలం ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పాపారావు, ప్రభావతి, కొటమ్మ, అనిల్‌కుమార్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎంఏ.రజాక్, వైఎస్సార్‌సీపీ నాయకులు

నూతన బోరు ఏర్పాటు

నందికొట్కూరు: పట్టణంలోని 9వ వార్డులో తాగునీటి సమస్య పరిష్కారానికి నూతనంగా బోరు వేయించినట్లు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి శనివారం తెలిపారు. పట్టణంలోని ప్రతి ఇంటికి నీరు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని చెప్పారు. బోరుబావి వేయించేందుకు సహకరించిన శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి చైర్మన్‌తో పాటు కౌన్సిలర్ అబ్దుల్ రవూఫ్, వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

నందికొట్కూరు రూరల్: మండల పరిధిలోని బొల్లవరం గ్రామంలో నీటి సమస్య పరిష్కారానికి శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సహకారంతో నూతన బోర్‌ను ఏర్పాటు చేసినట్లు గ్రామ సర్పంచ్ వీరం జయలక్ష్మమ్మ తెలిపారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో నూతన బోరును ఏర్పాటు చేయడం ద్వారా గ్రామంలోని బీసీ కాలనీలో వేసవికాలంలో నీటి ఉండదన్నారు.

క్రీడలకు సహకరిస్తా

పాములపాడు: క్రీడలను ప్రోత్సహించడానికి ఎల్లప్పుడు తన వంతు సహకారం అందిస్తానని వైఎస్సార్‌సీపీ నందికొట్కూరు ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధీర్ దారా అన్నారు. శనివారం మండలంలోని వేంపెంట గ్రామంలో ఈస్టర్ పండుగ సందర్భంగా ఉమ్మడి జిల్లా స్థాయిలో ఏప్రిల్ 1 నుంచి నిర్వహించే కబడ్డీ పోటీల కరపత్రాలను విడుదల చేశారు. విజేతలకు మొదటి బహుమతి రూ.30,000 దాత రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, రెండవ బహుమతి రూ.20,000 దాత వైఎస్సార్‌సీపీ నందికొట్కూరు ఇన్‌చార్జ్ డాక్టర్ సుధీర్ దారా, మూడవ బహుమతి రూ.15,000 దాత జెడ్పీ టీసీ జ్యోతి రామలింగేశ్వరరెడ్డి, నాల్గవ బహుమతి రూ.10,000 దాత తుమ్మలూరు సర్పంచు వరప్రసాదరావు ఇవ్వనున్నారు. వేంపెంట గ్రామ మాల కమిటీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీల్లో పాల్గొన దలిచిన క్రీడాకారులు పూర్తి వివరాలకు 8790408681, 8125491828, 9014716286 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. మాజీ సొసైటీ చైర్మన్ ఎల్వీ రమణారెడ్డి, కబడ్డీ నిర్వహణ కమిటీ యూత్‌సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

ఆత్మకూరు: పట్టణంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో బాలికల విద్యాలయం, కళాశాలలో 6, ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామల కోరారు. ఈనెల 17 నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అడ్మిషన్ ప్రక్రియ జరుగుతుందని చెప్పారు.

సారా విక్రేత అరెస్ట్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం పరిధిలో నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ జి.ప్రసాదరావు తెలిపారు. ఆత్మకూరు మండలం కొట్టాలచెరువు గ్రామానికి చెందిన సభావత్ రాజశేఖరనాయక్ 10లీటర్ల నాటుసారా కలిగి ఉండడంతో శ్రీశైలం టోల్‌గేట్ సమీపంలో తనిఖీలు చేసి స్వాధీనం చేసుకుని, అరెస్ట్ చేసినట్లు వివరించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సంబరాలు



శిల్పా భువనేశ్వర్‌రెడ్డికి మిఠాయి తినిపిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా శిల్పా చక్రపాణిరెడ్డి పేరును అధిష్టానం శనివారం ప్రకటించడంతో పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద కార్యకర్తలు పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు శిల్పా భువనేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో మరోసారి శిల్పా భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా విజయం సాధించడం తథ్యమన్నారు. వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్ రెడ్డిలతో పాటు పలువురు కార్యకర్తలు సంబరాల్లో పాల్గొన్నారు. శిల్పా కార్తీక్‌రెడ్డికి స్వీట్లు తినిపించారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌చౌదరి, పువ్వాడ భాస్కర్, అంజాద్‌అలీ, అబ్దుల్‌రసూల్, నాగరాజు, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం కార్యాలయంలో మిఠాయిల పంపిణీ

ఆత్మకూరు: ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీశైలం నియోజకవర్గం అభ్యర్థిగా ఖరారు చేయడంతో రైతు సంఘం నాయకులు శనివారం పట్టణంలోని రైతు సంఘం కార్యాలయంలో మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం చైర్మన్ షేక్‌మహబూబ్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు మునీర్ బాషా, వార్డు సభ్యులు బాషా, నాయకులు టైగర్ బాబు, ముసలమడుగు నబిసా, షేక్ అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం

మహానంది: ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి టికెట్ ఖరారు చేయడంతో మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు రెండు మండలాల పార్టీ అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి, బారెడ్డి శ్రీనివాసరెడ్డిలు శనివారం మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. పరమటూరు సొసైటీ డైరెక్టర్ కొంగీస శివశంకర్, లింగాపురం సర్పంచ్ రాధమ్మ, నాయకులు శ్రీను ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

ఆడపిల్లలంటే చిన్నచూపు తగదు

జూపాడుబంగ్లా: ఆడపిల్లలంటే చిన్నచూపు విడనాడి మగపిల్లలతో సమానంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైన ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పావనిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని 80బన్నూరు, జూపాడుబంగ్లా, తంగడంచ గ్రామాల్లోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో బేటీపఢావో-బేటీ బచావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలనే చులకన భావనతో కొందరు కడుపులో ఉండగానే భ్రూణహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సమాజంలో క్రమేణా ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతుందన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ వర్కర్లు వెంకటరమణమ్మ, సునీత, సురేఖ, లక్ష్మీదేవమ్మ, గురుదేవి, తదితరులు పాల్గొన్నారు.



బాలికలకు సూచనలు ఇస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పావనిరెడ్డి

తాగునీటి పైపులైన్ ప్రారంభం

పగిడ్యాల: మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.15లక్షల మండల పరిషత్ నిధులతో ఏర్పాటు చేసిన బోరు, పైపులైన్ పనులను శనివారం శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్ ప్రారంభించారు. జెడ్పీటీసీ పుల్యాల దివ్య, గ్రామసర్పంచ్ సుజాత, ఉపసర్పంచ్ సాజిదాబేగం, పార్టీ మండల అధ్యక్షుడు పుల్యాల నాగిరెడ్డి అధ్వర్యంలో మోటార్లకు పూజలు నిర్వహించి స్విచ్ ఆన్ చేసి నీటి విడుదలను ప్రారంభించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తాగునీటి పైపులైన్ ప్రారంభానికి పూజలు నిర్వహిస్తున్న సిద్ధార్థరెడ్డి, దారా సుధీర్

వైభవంగా మహానందీశ్వరుడి కల్యాణోత్సవం



కల్యాణోత్సవ పూజలందుకున్న మహానందీశ్వర దంపతులు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు శనివారం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, అక్షితల సమర్పణ, మాంగల్య ధారణ పూజలను చేపట్టారు. అనంతరం రాత్రి స్థానిక యాగశాలలో స్వామి, అమ్మవార్లకు ఏకాంత సేవ పూజలు వైభవంగా జరిగాయి. పూజల అనంతరం భక్తులకు స్వామి, అమ్మవారి ప్రసాదాలు పంపిణీ చేశారు. వీకెండ్ కావడంతో శనివారం మహానంది ఆలయంలో భక్తులరద్దీ నెలకొంది. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు.

ఇంటి వద్దనే వైద్యపరీక్షలు

కొత్తపల్లి: ప్రజల ఆరోగ్యం దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ఇంటి వద్దకే వైద్య బృందాన్ని పంపి వైద్య పరీక్షలు చేయిస్తోందని కొత్తపల్లి వైద్యాధికారి దీపానాగవేణి అన్నారు. శనివారం వైద్యసిబ్బంది కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నందికుంట, బావాపురం గ్రామాలలో ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహించిందన్నారు. ఈ క్యాంపుల్లో భాగంగా షుగర్ నిర్ధారణ అయిన వారికి వ్యాధి నివారణ కోసం మరలా ప్రభుత్వం ఇంటింటికీ వెళ్లి హెచ్‌బీఏ1సీ టెస్టులను చేయాలని ఆదేశాలిచ్చిందన్నారు. దీంతో వైద్యసిబ్బంది గ్రామాలవారీగా షుగర్ వ్యాధిగ్రస్తులకు టెస్టులు చేసి, మందులను పంపిణీ చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్ఎం చెన్నమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ హన్నమ్మ పాల్గొన్నారు.



నందికుంట గ్రామంలో హెచ్‌బీఏ1సీ టెస్ట్‌కోసం రక్తం సేకరిస్తున్న వైద్యసిబ్బంది

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

మిడుతూరు: సోమవారం నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓలు రామిరెడ్డి, శ్రీనాథ్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను (మిడుతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, కడమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల) పరిశీలించారు. వారు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు 18 నుంచి 27వ తేదీ వరకు ఉంటాయన్నారు. మూడు పరీక్షా కేంద్రాలలో 737 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు.

పది పరీక్షలకు 510 మంది విద్యార్థులు

పాములపాడు: ఈ నెల 18 నుంచి నిర్వహించనున్న 10వ తరగతి వార్షిక పరీక్షలకు 510 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు ఎంఈఓ బాలాజీనాయక్ శనివారం తెలిపారు. మండల కేంద్రంలోని పరీక్షా కేంద్రాలైన ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 238 మంది, ఏపీ మోడల్ స్కూలు 272 మంది చొప్పున విద్యార్థులను కేటాయించినట్లు చెప్పారు. మండలంలోని మిట్టకందాల, లింగాల, వానాల, తుమ్మలూరు, పాములపాడు జెడ్పీహై స్కూల్స్, ఏపీ మోడల్ స్కూలు, కేజీబీవీ, శ్రీశారద విద్యానికేతన్ హై స్కూలు, వివేకానంద విద్యావిహార్ హైస్కూలు విద్యార్థులు ఆయా కేంద్రాల్లో పరీక్షలు రాస్తారని వివరించారు.



కడుమూరులో ఏర్పాట్లు చేస్తున్న నిర్వహణ అధికారి సాయి తిమ్మయ్య, డీఓ భరత్ భూషణ్

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

మహానంది: బండిఆత్మకూరు మండలంలో ఈ నెల 18 నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ యశోద తెలిపారు. శనివారం పరీక్షా కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ బండిఆత్మకూరు జడ్పీ హెచ్ఎస్, ఏపీ మోడల్ స్కూల్, సంతజూటూరు జడ్పీహెచ్ఎస్ మూడు కేంద్రాలు ఉంటాయన్నారు. మూడు పరీక్షా కేంద్రాల్లో 515 మంది రెగ్యులర్ విద్యార్థులు, 246 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. పరీక్షా కేంద్రానికి విద్యార్థులు తప్పనిసరిగా గంట ముందు రావాలన్నారు.